మైంది. ఒక్కసారిగా తల వంచుకున్నాడు. "మామయ్యా" అని పెద్దకేక వేసి గోమతి ఆయనవళ్ళోకి వరగింది, నువ్వేనా చెప్పకపోతివిగదా అన్నట్టు. ఇది చూసి, ముసలాయన మళ్లీ కళ్లనీళ్లు పెట్టుకోవటం, మగవాడు, ఆయనకూడ యెంత బాధపడుతున్నాడో అని అక్కడకొచ్చినవాళ్లు అనుకోవటం, గోమతికంటె యెక్కువగా ఏడుస్తున్న శారదమ్మను ఓదార్చటం—ఇవన్నీ జరిగినాయి.

రామయ్యగారి రాకవలన గోమతిప్రయాణం ఆగిపోయింది. లేకపోతే యెక్కడికి వెళ్లేదో అని అందరు అనుకున్నారు. రోజులు మారినాయి. మనస్సులుమాత్రం మారలా. ఆయనరాక గోమతిమనస్సు మార్చలేదు. ఆవిడ సమయంకోసం నిరీక్షిస్తున్నట్టు కనిపించింది. ఇట్లా వుండగా, అన్నయ్యదగ్గిరనుంచి యింతవరకూ వుత్తరం లేదు, యే విషయం తెలియలేదు అనుకొని, మంగమ్మ బయలుదేరివచ్చింది యిక్కడికి కొడుకు, కోడలితోసహా. రతిని చూడగానే గోమతి గబగబ వెళ్లి యింట్లోకి తీసుకు వెళ్లింది, మంగమ్మవేపు కోరచూపు చూస్తూ. మంగమ్మ, శారదమ్మ యిష్టాగోష్టిగా మాట్లాడుకున్నారు. మంగమ్మ యేమో, వాళ్ల యింటిదగ్గర జరిగిన తతంగంఅంతా శారదమ్మతో చెప్పింది. శారదమ్మేమో, ఆఅమ్మాయి ప్రయాణం అవటం, రామయ్యగారు రావటం యీ గ్రంథం అంతా మంగమ్మతో చెప్పింది. రామయ్య, మేనకోడలును దగ్గరకు తీసుకొని ఏవో నీతులు బోధిస్తూనే వున్నాడు.

ఆనాడు రాత్రిభోజనాలు అయినాయి. నిద్రపోయే సమయం. గోడగడియారం పదకొండు కొట్టింది. ఆచప్పుడు తప్ప అంతా నిశ్శబ్దం. గోమతితప్ప అంతా గాఢనిద్రలో వున్నారు. అగడియారపు ముల్లే ఒకటి, రెండుమీదకు రావటంగూడ, గోమతి చూస్తూనేవుంది. రెండు దాటుతూవుండగా ఒక చక్కటి వూహ తట్టింది. ఆవూరికి సుమారు 30 మైళ్లదూరంలో ఓ ఆశ్రమము వున్నది. ఓసారి వాళ్ల మామయ్య ఆఆశ్రమాన్ని గురించి చెప్పుతుండగా విన్నది. అక్కడకు అందరూ వెళ్లవచ్చుని, ఉచితంగా భోజనాలు యేర్పాటుచేస్తారని, అనాథస్త్రీలకు, అనాథబాలురకు ప్రత్యేకయేర్పాట్లు వున్నాయని, అక్కడ వుండే స్త్రీపురుషులకు వివాహముచేసుకోవాలని యిచ్ఛకలిగితే, అచ్చటి మేనేజరుకు తెలియపరుస్తే ఆయనే స్వయంగా వివాహమునకు పూనుకుంటాడని, అనేకవిధాల స్త్రీ, పురుషుల ఉద్ధరణకు ఆ ఆశ్రమము యేర్పడినదని చెప్పుతుండగా గోమతి విన్నది. ఆఆశ్రమానికి వెళ్లితే తన కోరిక ఫలిస్తుందని ఆవిడకు గట్టి నమ్మకం కల్గింది. వెంటనే తలుపు తీసుకొని, ఆవెన్నెల రాత్రిలో గబగబ స్టేషనుకు దారిపట్టింది. మర్నాడు తొమ్మిదిగంటలకు ఆశ్రమానికి చేరుకుంది.

మామూలుగానే తెల్లవారింది. ఎవరి పనులలోకి వాళ్లు వెళ్లారు. దిగులుతో పడుకుందేమోలే, యిప్పటినుంచి లేపటం యెందుకు ఆవిడ చేసే పనంతా చెడిపోతుందికనక నా అంటూ శారదమ్మ గోమతిగదివైపు వెళ్లలేదు. అందరూ అదే వుద్దేశపడ్డారుగామాలు, యెవరూ ఆగదివైపు వెళ్లలేదు. తొమ్మిదిగంటలయినా లేవకపోతే, యింతసేపటిదాకా పడుకుందే అని గదిలోకి వెళ్లారు. గోమతి కనిపించలా. రామయ్యశాంతమ్మల గుండెలు ఝల్లుమన్నాయి. తలోమూల పరిగెత్తారు. ఇంతలో మంగమ్మ వచ్చి 'నేను తెల్లవారుఝామున లేచేటప్పటికి వాకిటితలుపు గొళ్లెము తీసివున్నది, మీరెవరైనా తీసి వాకిట్లోకి వెళ్లి, తెల్లవారొస్తోంది గదా అని మళ్లీ వెయ్యలేదేమో అనుకున్నా. అయ్యో! అప్పుడే చెప్పితే, కనిపెట్టేవాళ్లమేమో' అని గోలపెట్టింది.

రామయ్యగారు పెద్ద కర్మిష్టి కాకపోయినా, ఆధునికఅలవాట్లలో ముందంజ వెయ్యటానికి జంకుతాడు. ఎవరైనా ముందంజవేస్తే, ఆయనకంటె సంతోషించేవాడు యింకొడుండడు. మన జీవితం ముప్పాతిక వెళ్లిపోయింది. తప్పో వప్పో ఆపాతికకూడ వెళ్లిపోతేసరిపోతుంది. ఈకాస్తలో మార్పు యెందుకులే అని అనుకుంటాడు. గోమతి వెళ్లిపోవటం ఆయనకే ఆశ్చర్యం వేసింది. తనను మోసగించింది అనుకున్నాడు. మళ్లీ ఆవిడస్థితి జ్ఞాపకం తెచ్చుకొని జాలిపడ్డాడు. ఎక్కడికి వెళ్లిందో, యేం కష్టాలు పడుతుందో. యింటికి తీసుకువస్తే బాగుంటుందని తన యెరికగల నాలుగు చోట్లకి కబురుపంపాడు. మర్నాడు ఆయన ఓవైపు

